క్లుప్తంగా

'రేవు తిరగబడితే ఊరు కురుక్షేత్రమే' పుస్తకావిష్కరణ



నెహ్రూనగర్: నగరంలోని ఓ హోటల్‌లో శనివారం 'రేవు తిరగబడితే ఊరు కురుక్షేత్రమే' అనే పుస్తకాన్ని ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ ఆవిష్కరించారు. కార్యక్రమానికి ప్రచురణకర్త డాక్టర్ అన్నవరపు నాగమల్లేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యలు, అన్యాయాల్ని ఎదిరించి రజకులు చేసిన పోరాటాల్ని పుస్తక రూపంలో రచించిన రచయిత సుబ్బాచారి అభినందనీయులన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, కుమ్మర క్రాంతికుమార్, పూర్ణ, కృష్ణ, శ్రీరాములు, వసంత్, జాన్‌బాబు పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ




గుంటూరు మెడికల్: గుంటూరు రూరల్ మండలం గోరంట్ల ప్రభుత్వ ఛాతి, సాంక్రమిత వ్యాధుల హాస్పిటల్‌లోని ఏఆర్టీ సెంటర్‌లో హెచ్‌ఐవీ చిన్నారులకు శనివారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. లాంప్ స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో ఏఆర్టీ మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ వెన్నెల, డాక్టర్ సరిత పర్యవేక్షణలో సంపూర్ణ పౌష్టికాహారం అందజేశారు. దాతల సాయంతో చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో షిప్ జనరల్ సెక్రెటరీ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు కోటిరత్నం, సౌజన్య, భాగ్యలక్ష్మి, స్టాఫ్ నర్స్ లోకేశ్వరి, ఫార్మసిస్ట్ జ్యోతి, కేర్ కో–ఆర్డినేటర్ గీత, శ్రీనివాసరావు, సువర్ణ, హేమలత పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లోనూ ప్రతిభ చూపాలి



నెహ్రూనగర్: పంజాబ్‌లో మార్చి 2 నుంచి 5వ తేదీ వరకు నిర్వహించనున్న ఆల్ ఇండియా పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌కు ఎంపికైన అశోక్ కుమార్‌ను నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు శనివారం క్యాంపు కార్యాలయంలో అభినందించారు. పోటీల్లో సత్తా చాటి బంగారు పతకాన్ని సాధించి గుంటూరుకు పేరు ప్రఖ్యాతలు తేవాలని ఆకాంక్షించారు. నగరంలోని ఉమెన్స్ కాలేజీలో ఈ నెల 9న నిర్వహించిన ఇంటర్ కాలేజీ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌లో 640 కేజీల బరువును ఎత్తి గోల్డ్ మెడల్ సాధించడంతో పాటు స్ట్రాంగ్ మాన్ టైటిల్ సాధించడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గులాం రసూల్, సాల్మన్ రాజ్, శ్రీనివాసరావు, మహేష్, షారుఖ్‌ఖాన్ పాల్గొన్నారు.

నేడు త్రీడీ క్యాథ్ ల్యాబ్ ప్రారంభం



గుంటూరు మెడికల్: ఏపీలో మొదటిసారిగా త్రీడీ క్యాథ్ ల్యాబ్ సేవల్ని తమ ఆస్పత్రిలో ప్రారంభిస్తున్నట్లు కార్డియాలజిస్టు డాక్టర్ ఉప్పుటూరి అంజిత్ చెప్పారు. ఆదివారం ఉదయం 10 గంటలకు గుంటూరు కొత్తపేట ఓల్డ్ క్లబ్ రోడ్డులోని అమృత హాస్పిటల్స్ పై భాగంలో యాంజియో కేర్ హార్ట్ అండ్ వాస్క్యులర్ ఇనిస్టిట్యూట్ ప్రారంభిస్తున్నామని చెప్పారు. త్రీడీ క్యాథ్ ల్యాబ్‌తో యాంజియోగ్రామ్, హార్ట్, బ్రెయిన్, లెగ్‌లో స్టంటింగ్, పేస్‌మేకర్, గుండె, బ్రెయిన్ సంబంధిత సమస్యలకు కచ్చితత్వంతో చికిత్స అందించవచ్చని చెప్పారు. సమావేశంలో న్యూరోసర్జన్ డాక్టర్ ఉప్పుటూరి హేమంత్, డాక్టర్ మద్ది వినోద్‌కుమార్, డాక్టర్ మండే సింధూర, డాక్టర్ చదలవాడ ప్రియ పాల్గొన్నారు.

బీపీ మండల్ విగ్రహ ఏర్పాటు అభినందనీయం

నెహ్రూనగర్: బీసీ రిజర్వేషన్ల పితామహుడు బీపీ మండల్ విగ్రహాన్ని ఆదివారం నగరంలో ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ పేర్కొన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో రెండు రోజుల పాటు జరిగిన బీసీ మేధావుల సదస్సు శనివారం ముగిసింది. ఈ సందర్భంగా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ మండల్ ఆశయాలకు అనుగుణంగా బీసీలంతా నడుచుకోవాలని సూచించారు. రిటైర్డ్ జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలు చేయడంలో చూపినంత చొరవ ఓబీసీల రిజర్వేషన్ల విషయంలో చూపించక పోవడం విచారకరమని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా బీసీల కులాల వారీగా కులగణన చేపట్టాలని పలువురు బీసీ మేధావులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీపీ మండల్ మనవడు సూరజ్ మండల్, డాక్టర్ అలా వెంకటేశ్వరరావు, ప్రొఫెసర్ నారాయణ, ప్రొఫెసర్ పాత్రో, ప్రొఫెసర్ సందీప్‌యాదవ్, ప్రొఫెసర్ కృష్ణకాంత్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్

కొల్లేరును సందర్శించిన జాతీయ సదస్సు ప్రతినిధులు

ఏఎన్‌యూ: నాగార్జున యూనివర్సిటీ ఆక్వా కల్చర్ విభాగం ఆధ్వర్యంలో 'రీసెంట్ అడ్వాన్సస్ ఇన్ ఆక్వా కల్చర్ మేనేజ్మెంట్ అండ్ ఎన్విరాన్మెంటల్ ఇష్యూస్' అనే అంశంపై నిర్వహిస్తున్న జాతీయ సదస్సులో భాగంగా శనివారం ప్రతినిధులు పశ్చిమ గోదావరి జిల్లా కొల్లేరు సరస్సు సందర్శనకు వెళ్లారు. కొల్లేరు పరిసర ప్రాంతాల్లో పలు చేపల చెరువుల్ని సందర్శించారు. ప్యాకింగ్, ఐసింగ్ యూనిట్లలో ప్రక్రియను పరిశీలిచారు. చేపల శుభ్రం, ప్యాకింగ్, పార్సిల్ చేయడం వంటి అంశాల్ని చెరువుల నిర్వాహకులు సదస్సు ప్రతినిధులకు వివరించారు. అనంతరం ఆ ప్రాంతంలోని చేపల మార్కెట్లను బృందం సందర్శించింది. చేపలు, రొయ్యల ధరలు, విక్రయం తదితర అంశాల్ని తెలుసుకుంది. ఏఎన్‌యూ పూర్వ పరిశోధకుడు, ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ అధికారి డాక్టర్ గోవింద్ ఆక్వా రంగంలోని పలు అంశాల్ని ప్రతినిధులకు వివరించారు. సదస్సు డైరెక్టర్ ప్రొఫెసర్ కె.సునీత, జువాలజీ విభాగ అధ్యాపకుడు ప్రొఫెసర్ సింహాచలం పాల్గొన్నారు.



చేపల ప్యాకింగ్ గురించి ఆక్వాకల్చర్ ప్రతినిధులుకు వివరిస్తున్న రాజు

యువతి ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: యువతి ఆత్మహత్యపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. స్తంభాలగరువుకు చెందిన చల్లా మరియమ్మ రెండో కుమార్తె తిరుపతమ్మ (20) ఇళ్లల్లో పనులు చేసుకుంటుంది. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ మానసికంగా కృంగిపోయింది.దీంతో శనివారం ఎలుకల మందు తింది. ఆలస్యంగా గుర్తించిన కుటుంబ సభ్యులు జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలి మెట్టెను మింగిన నాలుగు నెలల పసికందు

విజయవంతంగా బయటకు తీసిన జీజీహెచ్ వైద్యులు

గుంటూరు మెడికల్: ఓ పసికందు కాలి మెట్టెను మింగింది. భయాందోళనతో తల్లిదండ్రులు పలు ఆసుపత్రులు తిరిగినా బయటకు తీయలేకపోయారు. ఆందోళనతో జీజీహెచ్‌కు వచ్చిన తల్లిదండ్రులకు వైద్యులు భరోసా కల్పించి గొంతు నుంచి మెట్టెను బయటకు తీసి ప్రాణాపాయస్థితి నుంచి రక్షించారు. పల్నాడు జిల్లా వినుకొండ మండలం ఏనుగుపాలేనికి చెందిన అడ్డాగొట్టం అరుణ్‌కుమార్, శ్రీవల్లి దంపతుల నాలుగు నెలల పసికందు శుక్రవారం కాలి మెట్టెను మింగింది. తల్లిదండ్రులు వినుకొండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందించినా బయటకు తీయలేకపోయారు. గుంటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో సైతం వైద్యులు చేతులు ఎత్తేయడంతో శనివారం ఉదయం జీజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య విభాగానికి తీసుకొచ్చారు. విభాగాధిపతి డాక్టర్ అనుమల కవిత ఆధ్వర్యంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ షేక్ నాగూర్‌బాషా, పీజీ వైద్యుడు డాక్టర్ అనిల్‌కుమార్ పసికందును పరీక్షించారు. కేవలం రెండు నిమిషాల వ్యవధిలోనే ఎండోస్కోపి ద్వారా గొంతులో ఇరుక్కున్న మెట్టెను బయటకు తీసి తల్లిదండ్రుల ఆందోళన తొలగించారు. పసికందు ప్రాణాలు కాపాడిన గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులను జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి అభినందించారు.



ఎండోస్కోపి ద్వారా మెట్టెను బయటకు తీసిన డాక్టర్ నాగూర్‌బాషా, వైద్య సిబ్బంది

వైభవంగా మస్తాన్‌షా ఉరుసు మహోత్సవాలు



భక్తులకు అన్నదానం చేస్తున్న దూండీశ్వరి

పాత గుంటూరు: జీటీ రోడ్డులోని హజరత్ కాలే మస్తాన్‌షా అవులియా దర్గా 131వ ఉరుసు మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. కార్యక్రమాల్లో భాగంగా శనివారం బాబా సమాధిను పూలతో విశేషంగా అలంకరించి ప్రార్థనలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో బాబా సమాధిని దర్శించుకుని చాదర్లను సమర్పించారు. అనంతరం దర్గా నిర్వాహకుల ఆధర్యంలో భక్తులకు, ఫకీర్లకు అన్నదానం చేశారు. సాయంత్రం బాబాకు సంవత్సరంలో భక్తులు సమర్పించిన చాదర్‌లను ఫకీర్లకు పంపిణీ చేశారు. కార్యక్రమాల్ని దర్గా ధర్మకర్త రావి రామ్మోహనరావు, దూండీశ్వరీ పర్యవేక్షించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: నటరాజ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ముత్యాలరెడ్డినగర్ 7వ లైనులో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు న్యూరాలజిస్టు డాక్టర్ పి.నటరాజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు బొడ్డు చంద్రయ్య నివాసం వద్ద నిర్వహించనున్న శిబిరంలో ఉచితంగా దంత, కంటి, షుగర్ పరీక్షలు చేసి మందులు కూడా ఉచితంగా అందిస్తామని పేర్కొన్నారు. జనరల్ ఫిజీషియన్ ఆధ్వర్యంలో అన్ని వ్యాధులకు వైద్య పరీక్షలు చేస్తారని తెలిపారు. నొప్పులకు ఫిజియోథెరఫీ చేస్తామని వెల్లడించారు. నగర ప్రజలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఘంటసాలకు ఘన నివాళి

పాత గుంటూరు: అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 49వ వర్ధంతి సందర్భంగా శనివారం కళా దర్బార్ ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపకుడు పొత్తూరి రంగారావు ఆధ్వర్యంలో కొత్తపేటలోని నాజ్ సెంటర్ ఐలాండ్‌లో ఆయన కాంస్య విగ్రహానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ భాను ప్రకాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుజాతి ఉన్నంతవరకు ఘంటసాలను మరువలేమని తెలిపారు. రంగారావు మాట్లాడుతూ ఘంటసాల 50 వేలకు పైగా పాటలు పాడి ప్రతి ఒక్కరి మదిలో చిరస్మరణీయులయ్యారని కొనియాడారు. కార్యక్రమంలో సభ్యులు జె. మురళీకృష్ణ, డి. బాలస్వామి, బి.చంద్రబాబు, కె.బాబూరావు, సుధాకర్, ఎన్ .మల్లేశ్వరరావు, ధర్మ నారాయణ సింగ్, ఎస్‌కే సత్తార్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న భానుప్రకాష్, రంగారావు, సంస్థ సభ్యులు

దుకాణంలో చోరీ

పట్నంబజారు: దుకాణంలో చోరీపై కేసు నమోదైంది. సాయిబాబా కాలనీలోని ఓ నిత్యావసర సరుకుల దుకాణంలో శుక్రవారం రాత్రి దుండగులు తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. సుమారు రూ. 40వేలు విలువ చేసే సరుకులను ఎత్తుకుపోయారు. దుకాణ యజమాని భారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగాలకు 64 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాలలో శనివారం స్పీకింగ్ ట్రీ సంస్థ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. డిగ్రీ చివరి సంవత్సర విద్యార్థులు 64 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.నాగేశ్వరరావు తెలిపారు. మొత్తం 210 మంది పాల్గొనగా వివిధ దశల్లో నిర్వహించిన ఎంపిక పరీక్షల్లో తుది దశకు చేరుకున్న 64 మంది విద్యార్థుల్ని ఏడాదికి రూ.1.80 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల్ని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, కరస్పాండెంట్ జె. మురళీమోహన్, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్ఆర్‌కే ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ పి. గోపీచంద్, ప్లేస్‌మెంట్స్ అధికారి వై. సురేష్‌బాబు అభినందించారు.

కార్యాలయాన్ని తగులబెట్టిన కేసులో ఏడుగురి అరెస్టు

గుంటూరు ఈస్ట్: రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా కార్యాలయాన్ని తగులబెట్టిన కేసులో ఏడుగురు నిందితుల్ని అరండల్‌పేట పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఎస్‌హెచ్‌ఓ రామానాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 7వ తేదీ తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు వల్లూరివారితోట 6వ లైనులో ఉన్న రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా కార్యాలయాన్ని తగులబెట్టారు. పార్టీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బోరుగడ్డ అనిల్‌కుమార్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు ఏడుగురిని అరెస్టు చేశారు. బొంగరాలబీడుకు చెందిన బోరుగడ్డ వెంకట్రావు, డొంకరోడ్డుకు చెందిన యాదుపాటి సాయికిరణ్, వసంతరాయపురానికి చెందిన జెట్టి సుధాకర్, బొంగరాలబీడకు చెందిన చిన్నం రవికాంత్, గుడిసె పవన్‌కుమార్, శ్రీనగర్‌కు చెందిన తిరుమలశెట్టి సాయివినయ్, బొంగరాలబీడుకు చెందిన లోకం జయంత్‌ను అరెస్టు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ రామానాయక్ తెలిపారు. కేసు పురోగతిలో కృషి చేసిన ఎస్ఐ టి.నాగరాజు, సిబ్బందిని ఆయన అభినందించారు. ఒక వ్యక్తి పరారీలో ఉన్నట్లు చెప్పారు.

ప్రజల జీవనశైలితో అవసరంగా మారిన ఆరోగ్య బీమా

ఏఎన్‌యూ: ప్రస్తుత ఆర్థిక అసమానతలు, ప్రజల జీవనశైలి వల్ల ఆరోగ్య బీమా అవసరంగా మారిందని ఏఎన్‌యూ విశ్రాంత ప్రిన్సిపాల్ నూర్ బాషా అబ్దుల్ తెలిపారు. నాగార్జున యూనివర్సిటీ ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో 'భారత దేశంలో ఆరోగ్య బీమా ఆవశ్యకత' అనే అంశంపై రెండు రోజుల పాటు జరిగిన జాతీయ సదస్సు శనివారంతో ముగిసింది. ముఖ్య అతిథిగా హాజరైన అబ్దుల్ మాట్లాడుతూ డబ్బులు వెచ్చించి మరీ కలుషిత ఆహారాన్ని కొంటున్నామని, వాటిని తినడం వల్ల అనేక రోగాలకు గురవుతున్నామని తెలిపారు. దీనికి కారణమేమిటో అంతా ఆలోచించాలని ఆయన సూచించారు. గుంటూరు సర్వజన అసుపత్రి అడ్మినిస్ట్రేటర్ బి. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ బీమా సంస్థలు, హాస్పిటల్స్, బీమాదారులు నైతిక విలువలు పాటిస్తేనే ఆరోగ్య బీమా లక్ష్యం సక్రమంగా నెరవేరుతుందని చెప్పారు. విజయవాడ ప్రశాంతి హాస్పిటల్స్ సీఈఓ డాక్టర్ చక్రవర్తి, కృష్ణా యూనివర్సిటీ ఎంబీఏ అధ్యాపకులు జయశంకర్ ప్రసాద్, కృష్ణాజిల్లా వైద్య సలహాదారు డాక్టర్ ఎం. కృష్ణ చైతన్య, గుంటూరు హిందూ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.వి. రమణ, ఏఎన్‌యూ గ్రామీణాభివృద్ధి విభాగం అధ్యాపకులు కె. సోమశేఖర్ ప్రసంగించారు. సదస్సు డైరెక్టర్ వి. తులసీదాస్ నివేదికను సమర్పించారు. హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ అధ్యాపకులు పి. శ్రీనివాసరావు, డేవిడ్, సాధిక్, శ్రీధర్‌రెడ్డి, చండీప్రసాద్, పలువురు అధ్యాపకులు, పరిశోధకులు విద్యార్థులు పాల్గొన్నారు.



విశ్రాంత ప్రిన్సిపాల్ అబ్దుల్‌ను సన్మానిస్తున్న సదస్సు డైరెక్టర్ తులసీదాస్

ఆటో చోరీ

పట్నంబజారు: ఇంటి ముందు నిలిపిన ఆటోను దుండగులు చోరీకి పాల్పడిన ఘటనపై కేసు నమోదైంది. సాయిబాబా కాలనీలో నివాసం ఉండే వెంకటేశ్వరరావు ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి దుండగులు ఇంటి ముందు నిలిపి ఉన్న ఆటోను అపహరించుకుపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.